
6




# ఊరికొక బడి

కలువకొలను సదానంద

చెట్టుకింద రాయి నిలబెట్టి, ఇది గుడి అంటారు కదా? బడి కూడా అంతేనండీ ఈ రోజుల్లో! అది చెట్టు కానీ, పుట్టకానీ, రహదారి కానీ, రచ్చబండకానీ ... ఎక్కడైతే పంతులు అనబడే పరమదీనుడు గుంజ పాతినట్లు నిలబడతాడో అది బడి అన్నమాట!

ఉయ్యాల చింతలో చింతచెట్టు నీడే బడి! చుట్టూ పేడదిబ్బలు, చెట్టుకింద పిల్లలు, చెట్టుపైన కోతులు. ఆ అల్లరి కుంకలు కోతుల్ని వెక్కిరిస్తూ కాలక్షేపం చేస్తారు తప్ప, పంతులుగారు చెప్పే పాఠాలు చెవిన వేసుకోరు. బడికి ఎగనామం బెట్టిన దొంగభడవ కూడా ఆ చెట్టు కొమ్మల్లోనే దాక్కుని ఉన్నాడన్న సంగతి పంతులుగారికి తెలియదు. వాన లేకపోయినా, ఎండ లేకపోయినా, అంత చల్లటి నీడలో కూడా పంతులుగారు గొడుగు వేసుకుని నుంచుంటాడు, కాకి రెట్ట నెత్తిన పడుతుందన్న భయంతో! వర్షం వస్తే బడికి సెలవు. చెట్టు యజమాని

**చింతకాయలు దులుపుకోవాలన్నా బడికి సెలవే!**

ఎనమలకుంటలో ఓ బడి ఉంది. తాతలనాటి కొట్టం అది. తలుపులూ, కిటికీలూ ఉండవలసినచోట ఆ సైజు బొక్కలు మాత్రం ఉంటాయి. మైలు దూరం నుంచి వస్తాడు అయ్యవారు. స్కూలు రికార్డులన్నీ ఆయనింట్లోనే ఉంటాయి. ఉదయం ఆయన బడికి వచ్చేసరికి, ఊరివాళ్ల గేదెలు, ఆవులు అంబా అంబా అంటూ బడిలో రంకెలు వేస్తూంటాయి. అయ్యవారు ఊళ్లో వాళ్లని బతిమాలి, వాటిని సాగనంపుతాడు. బడిలోనే మరోమూలలో ఇంకా సుఖనిద్రలోనే ఉన్న బిచ్చగాళ్లను లేవగొట్టి బయటికి తరుముతాడు. స్కూల్లో ఒకప్పుడు టేబిలూ, కుర్చీ, నల్లబల్లా ఉండేవి. అవి ఏమైపోయాయో, ఇప్పుడు చిన్న చెక్కపేడు కూడా లేదు. పంతులుగారు ఓ రాతిబండమీద కూర్చుంటారు. జానెడెత్తు దుమ్ములో పిల్లలు కూర్చుంటారు. రాత్రి ముష్టివాళ్లు పోసిన మూత్రమూ, ఉమిసిన ఎంగిలీ పిల్లల ఒంటికి నలుగులవుతాయి. పాపం, వాళ్లకు ఒళ్లంతా గజ్జి. గోక్కుంటూ ఉంటారు. పైకప్పులోంచి ఆకాశం కనిపిస్తూ ఉంటుంది. ఏ ఇంట్లో పొయ్యి వెలగకపోతే ఆ ఇంటి ఇల్లాలు నేరుగా వచ్చి బడి చూరులో చెత్త లాక్కుపోతుంటుందాయె! వాన చినుకు పడితే చాలు, దారిన పోయే దేశదిమ్మరులంతా ఏమాత్రం జంకూ గొకూ లేకుండా లోపల దూరి బడిపిల్లల నడుమ సర్దుకు కూర్చుంటారు. బడి వదలటం ఆలస్యం ... మళ్లీ లోపల గొడ్డూ గోదా, పేకాట, పిచ్చాపాటీ మామూలే! ... ఎన్నని చెప్పమంటారు ఇలాంటి స్కూళ్ల?

ఇలా అయితే ఎలాగు? పంతుళ్లు చదువులెలా చెబుతారు? పిల్లలేం నేర్చుకుంటారు? మనకాలంలో సోషలిజం రావడం ఎంత సాధ్యమో, ఈ బడుల్లో చదువులు రావడం అంతే సాధ్యం!

మన ఉచిత విద్య ఇంత వైభవోపేతంగా ఉంది కనుకనే, గొర్రిపాడులో స్కూలుకు పక్కా బిల్డింగు కట్టి ప్రారంభోత్సవం జరుపుతున్నందుకు సంతోషపడాలి.

ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, గ్రామస్థాయి పార్టీ కార్యకర్తలూ ఆధిగాగలవాళ్లంతా హడావుడిగా జీపుల్లో వెళ్లారు - గొర్రిపాడులో ఎనభైవేల రూపాయల ఎస్టిమేటుతో కట్టిన ఎలిమెంటరీ స్కూలు ప్రారంభోత్సవానికి!

# వరమాల-జయమాల

పెళ్లుమని విల్లు విరుగగ
యుల్లము ఝుల్లనుచు పొంగ నుర్వీసుతయున్
చల్లని నగవులె తొడవుగ
మల్లెల హారమ్ము బట్టి మానుగ కదిలెన్.

కదలుచు రాముం జేరగ
వదనము రవ్వంత నెత్తి వరమణి గనుచున్
ముదమున పొంగియు నంతనె
మదిలో సంకోచమొదవ, మరలిచె దృక్కుల్.

నిలువెత్తు పురుషసింహుని
నిలలో కడు రాచఠీవి నిలిచిన వానిన్
తల వంచగ నెటు తెలుపుట
తెలుపక హారమ్ము వేయు తీరెయ్యదియో.

అని తలపోయుచు సీతమ
తన యడుగులు తడబడంగ తక్కుచు రాగా
వనజాక్షిని గని రఘుపతి
యనిమిషతన్వాల్చి నిల్చె నక్షుల రెంటిన్.

అందరు డెందమ్ముల నా
నందము సందడి సేయగ నవకమలాక్షున్
సుందరు రఘుపతి జూచుచు
నిందిర మదిలోని వంత నెఱుగక యుండన్.

కడలి తరంగములట్లు పొ
గడికలను జనులు రాము గప్పడు వేళన్
ఒడలెల్ల కనులు కలిగిన
కడతమ్ముడు లక్ష్మణుండు గాంచెన్ తరుణిన్.

అయ్యమ చింతకు కారణ
మెయ్యదియో యనుచు నెడద నేర్పడ దలపన్
అయ్యది దోచిన యంతనె
నెయ్యంబున రాము డాసి నేరుపు మెరయన్.

భళిరా అన్నా రాఘవ
సలలితముగ ద్రుంచితీవు శంభుని ధనువున్
కొలువగ వశమే నీ బల
మిలలో నా వందనమ్ము నిదె గైకొమ్మా.

అని పదముల పడి మ్రొక్కగ
ననునయమున తమ్ము నెత్తి యక్కున జేర్చన్
తను దానె వంగుచున్నెడ
జనకజ వరమాల దెచ్చి చయ్యన వేసెన్.

అంతయు నారసి రఘుపతి
చెంతను తమ్ముడును సీత చెలగుచునుండన్
కాంతను జూచుచు నవ్వుచు
శాంతమ్మున నిట్టులనియె సహజస్మ్మితోన్.

అదరను శివధనువునకును
బెదరను దనుజాళి కెప్డు పీచమడంతున్
సదమలమగు నీ సుందరి
వదనమ్మును గాంచినంత పరవశుడైతిన్.

వరమాలకు తల వంచగ
మరచిన నా మందమతికి మందు గతి నీ
కరమరుదగు మేలుకొలుపు
వరమయ్యె నాదు మదిని భ్రాంతియు తొలగెన్.

అయినా నెన్నడొ ఏనీ
దయితకు తల వంచినాడ తను గన్నపుడే
నయమున నాపై గెలుపుకు
జయమాలను వేతునంతు జానకి గనుచున్.

ఆరడుగుల ఆ రాముడు
నా రీతిని బల్కుచుండ నానందమునన్
ఆ రమణీమణి సిగ్గున
గారముగా యొరగాంచి కన్నుల నవ్వెన్.

నరులును సురలను జయజయ
స్వరముల నభినందనలను జగతిని నింపన్
కరుణను రాముడు మాలను
ధరసుత మెడ వైచి మించె ధారుణి మెచ్చన్.

ధరణిని రాముడు సీతా
కరగ్రహణము జేసినట్టి కల్యాణశుభం
కరస్వారస్యపు కథనము
పరమై తనరారు నెల్ల ప్రజలందరికిన్.

జి.సి.రెడ్డి

ఎనభైవేలంటే మాటలా! అంత పెద్ద మొత్తంతో కట్టిన పక్కా బిల్డింగు ఎంత అద్భుతంగా ఉంటుందో కదా!

పల్లెలో లేదు ఆ బడి. రెండు హెక్టామీటర్ల దూరంలో ఓ మిట్టమీద ఉంది. దూరం నుంచి చూస్తే చాల ముచ్చటగా కనిపిస్తుంది.

ప్రారంభోత్సవం జరిగి నెల రోజులు గడిచాయి. దసరా సెలవుల్లో ఎవరో రౌడీలు ఓ చిన్న కుర్రాణ్ణి కిడ్నాప్ చేసి తెచ్చారు. వారి తండ్రిని బెదిరించి డబ్బు గుంజాలని వాళ్ల పథకం. ఆ కుర్రాడి చేతులు వెనక్కి విరిచి కట్టారు. వాడి నోట్లో గుడ్డలు కుక్కారు. పల్లెకు దూరంగా ఉన్న ఆ బడిలో బంధించి వెళ్లారు. తప్పించుకోటానికి మార్గం లేదని భయపడలేదు ఆ సిసింద్రీ. కాలితో ఎగిరి ఓ తన్ను తన్నాడు తలుపును! అట్ట ముక్కలా ఎగిరి బయటపడిపోయింది తలుపు. నోట్లో కుక్కిన గుడ్డ కుక్కినట్లే ఉంది, చేతులకు కట్టిన కట్లు కట్టినట్లే ఉన్నాయి, సురక్షితంగా ఇంటికి వెళ్లిపోయాడు కుర్రాడు.

మరో నెల తరువాత - ఆకాశంలో మబ్బులు ముసురుకున్నాయి. ఉరుములు డమడమా ఉరుముతున్నాయి. బడి వదిలేశారు. పాలోమంటూ పిల్లలంతా వెళ్లిపోయారు. చినుకుల్లో గొడుగు తెరిచిపట్టుకుని పంతులుగారు కూడా చరచరా సాగిపోయారు. దెబ్బతిన్న రాబందులా దబుక్కున నేలమీద పడింది వాన. గంటసేపు నేలను దంచిపారేసింది. గోడలు నానిపోయాయి. తిరగేసిన గొడుగులా వంగిపోయిన పైకప్పులోనుంచి నీళ్లు కారుతున్నాయి. తడిసిన కాంక్రీటు దబుక్కు దబుక్కున ముద్దలు ముద్దలుగా ఊడిపడసాగింది. మరికాసేపటికి బడి కుప్పగా కూలిపోయింది.

వాన వెలిసింది. రెండు హెక్టామీటర్ల దూరాన - చిమ్మచీకట్లోని గొర్రిపాడులో ఓ అందమైన రెండంతస్తుల మేడముందు పందిట్లో రంగురంగుల విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. లౌడ్ స్పీకర్లు గొంతు సవరించుకుని సినిమా పాటల పల్లవి అందుకున్నాయి.

విందు భోజనాల అవశేషాలకోసం సంబరంతో పందిరి దగ్గర కాచుకుని ఉన్నారు నక్కలోళ్లు.

కాంట్రాక్టరు కూతురి పెళ్లి వేడుక అది!

ప్రజా ప్రతినిధులు, ఆఫీసర్లు, ఉద్యోగులు, పార్టీ కార్యకర్తలూ అందరూ ఉన్నారు షామియానాలకింద! ■

## సైబర్ సరిగమలు



వుష్పల నరసింహం

# ధైర్యం తెచ్చుకున్న డి.ఒ.ఇ.

ప్రభుత్వం అంటే పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని ప్రజాస్వామికవాదుల అభిప్రాయం. వ్యక్తికి నీతి-నిజాయితీ ఎంత ముఖ్యమో, ప్రభుత్వాలకూ అంతే అవసరం. కాని, దురదృష్టవశాత్తు ఆధునిక ప్రజాస్వామ్యయుగంలో రాచరికపుచాయలు కనిపిస్తూ ఉన్నాయి. ప్రభుత్వం వేరు-ప్రజలు వేరు అన్న ప్రజాస్వామ్య సిద్ధాంతం ఇంకా బలపడలేదు. ఆ ఆలోచనలో ఉన్న మనకు ఎలక్ట్రానిక్ పరిపాలన(ఇ-గవర్నమెంటు) దోహదపడుతుంది. ఇ-గవర్నమెంటు లేకుండా పారదర్శకత ఊహించలేం. ఆసియాదేశా లైన మలేషియా, సింగపూర్‌వంటివి పారదర్శకతనే ప్రామాణికంగా తీసుకుని అడుగు ముందుకేస్తున్నాయి. దాంతో ఎలక్ట్రానిక్ ప్రభుత్వం ప్రభావం ఆసియాలోని మిగతాదేశాలపైకూడా కనిపిస్తోంది. ఆ దిశన పయనించడానికి ఆ యా దేశాలు తమ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆరకంగా ప్రజాస్వామ్యం పరిణతదశవైపు పయనిస్తోందని చెప్పుకోవచ్చు.

ఆసియాలో చైనా తరువాత భారతదేశం పెద్దదేశం. చైనాలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రభుత్వం ఉన్నప్పటికీ అనేక సంస్కరణలకు, ఆధునిక పాలనకు అనుగుణమైన చర్యలు తీసుకుంటున్నారు. నిపుణుల అంచనాప్రకారం భారతదేశంలోకన్నా చైనాలోనే కంప్యూటరీకరణ ఎక్కువగా జరుగుతోంది. అవసరమైనరంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులను, విదేశీపెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. ఆరకంగా సంప్రదాయ కమ్యూనిస్టు విధానాలకు చైనా ఎప్పుడో తిలోదకాలిచ్చి ముందుకుపోతోంది. మనదేశం విషయానికొస్తే ఇప్పుడిప్పుడే నిర్దిష్టమైన అవగాహనతో ఇ-గవర్నెన్స్‌వైపు దృష్టి మళ్లించింది.



అందులో భాగంగానే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్(డి.ఒ.ఇ.) ఆక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. ఇ-గవర్నెన్స్ ప్రవేశపెట్టేందుకు అనుకూలంగా డిపార్ట్‌మెంట్ రెగ్యులేషన్స్‌లో సవరణలు చేయనున్నది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని, వెబ్ పేజీల సంస్కృతిని ప్రజలు ఎక్కువగా ఉపయోగించుకునేందుకు వీలుగా ఈ సవరణలు ఉంటాయని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వ్యూహాలను రూపొందించేందుకు సలహాదారులసేవలు వినియోగించుకునేందుకు కూడా డి.ఒ.ఇ. సిద్ధంగా ఉంది. ఇండస్ట్రీ కన్సల్టేటివ్ కమిటీలను, సిటిజన్ కన్సల్టేటివ్ కమిటీలను, మినిస్ట్రీస్ కన్సల్టేటివ్ కమిటీలను ఏర్పాటుచేసి సరైన వ్యూహాలను రూపొందించడానికి డి.ఒ.ఇ. నడుం బిగించింది. వివిధ సాంకేతిక పరిజ్ఞానాలను అనుసంధానం చేసి అనంతరం ఎక్కువమంది ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వీలు సమాచారాన్ని (డాటా) టెలివిజన్లో ప్రసారం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. డి.ఒ.ఇ.లోనే నోడల్ కార్యాలయాలను ఏర్పాటచేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతమున్న డాటా బేస్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకునేందుకు అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సహించడానికి సైతం డి.ఒ.ఇ. ప్రయత్నాలు ప్రారంభించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై ఏర్పాటు చేసిన నేషనల్ టాస్క్‌ఫోర్స్ ఇ-గవర్నెన్స్‌కు సంబంధించి సిఫార్సులు చేసింది. ఆ సిఫార్సులను కాబినెట్ కమిటీ ఆమోదం పొందింది. ఆ రకంగా ఇ-గవర్నెన్స్‌కు మార్గం సుగమం అయింది. ఈ నేపథ్యంలోనే డి.ఒ.ఇ. తొలిదశగా రు.15 కోట్లతో పని ప్రారంభించింది. ఇతరదేశాల్లోని ఇ-గవర్నెన్స్‌ను కూడా ఈ డి.ఒ.ఇ. అధ్యయనం చేస్తోంది.

**వచ్చేవారం: ఐ.టి. విజన్** ■